క్లుప్తంగా

భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు



తలారి రంగయ్య, సమన్వయ కర్త

కళ్యాణదుర్గం: నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య ఆదివారం భోగి, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలోని ప్రజలు సుఖ సంతోషాలతో, భోగభాగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. కొత్త సంవత్సరంలో ప్రజలంతా భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ఇంటిల్లి పాది ఆనందంగా జరుపుకోవాలని కోరుకున్నారు.

పండుగను ఆనందంగా జరుపుకోవాలి



మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: ప్రజలందరికీ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అచ్చ తెలుగు పండుగను ప్రజలంతా ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. 'సంక్రాంతి అంటేనే మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే అచ్చ తెలుగు పండుగ' అన్నారు. భోగి మంటలు, రంగవల్లులు, బోగిపళ్లు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలి పటాల సందడితో సంక్రాంతి శోభ తీసుకొచ్చాయన్నారు. భోగి, మకర సంక్రాంతి.. కనుమ పండుగలను ప్రతి గ్రామంలో ప్రతి కుటుంబం సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

నిరుద్యోగులకు కూటమి సర్కారు మొండిచేయి


- ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్



రాష్ట్ర మహాసభల పోస్టర్లు విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

ఉరవకొండ: నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపిందని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్ ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఫిబ్రవరి 6 నుంచి 9 వరకు శ్రీకాకుళంలో ఏఐవైఎఫ్ మహా సభలు జరుగుతాయన్నారు. ఎన్నికల ప్రచారంలో నారా లోకేష్ నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి, ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి మోసగించారన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ ఇప్పటి వరకు అతీగతీ లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దేవేంద్ర, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు చౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల ఉత్సవం



జ్యోతుల ఉత్సవాలకు ముస్తాబైన పెద్దచౌడమ్మ ఆలయం

ఉరవకొండ: స్థానిక 4వ వార్డులో ప్రసిద్ధిగాంచిన పెద్ద చౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల ఉత్సవం ఈనెల 14 నుంచి జరగనుంది. తొగట వీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు జిల్లా వ్యాప్తంగా భక్తులు తరలిరానున్నారు. ఈనెల 14న దేవి చౌడప్ప ఇంటి నుంచి మంగళహారతి కలశాలతో అమ్మవారికి పులి కాపు నీళ్లు ఊరేగింపుగా తీసుకొచ్చి, విశేష పూజలతో అభిషేకిస్తారు. అనంతరం 15న పంచమ జ్యోతులు చౌడేశ్వరి కాలనీ నుంచి భారీ ఊరేగింపుగా ఆలయానికి చేరతాయి. మూడేళ్లకోసారి జరిగే అమ్మవారి జ్యోతుల ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాటు చేస్తున్నట్లు పెద్ద చౌడేశ్వరి తొగటవీర క్షత్రియ సంఘం గౌరవ అధ్యక్షుడు గట్టు ఎర్రిస్వామి, అధ్యక్షులు శిరుమాళ్ల కృష్ణమోహన్, కోశాధికారి పెద్దకోట్ల రవి తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు



ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన హెచ్‌ఎంపీవీ ప్రత్యేక ఐసోలేషన్ వార్డు

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో హెచ్‌ఎంపీవీ బాధితుల కోసం 4 పడకలతో ప్రత్యేక ఐసోలేషన్ వార్డు ఆదివారం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఐసోలేషన్ వార్డులో అన్ని సేవలు అందిస్తారు. వైద్యాధికారి ఎస్.వెంకటస్వామి చౌదరి మాట్లాడుతూ హెచ్‌ఎంపీవీ వైరస్ నుంచి రక్షణ పొందడానికి జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖానికి మాస్క్ ధరించడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, సామాజిక దూరం పాటించడం లాంటివి చేయాలన్నారు.

ఊరెళ్తున్నారా.. జాగ్రత్త!



- సంక్రాంతి వేళ అప్రమత్తత అవసరం
- పది రోజుల పాటు పాఠశాలలకు సెలవులు
- విహార యాత్రలకు వెళ్లేవారు ఎక్కువే
- పోలీసులతో పాటు ఇరుగు, పొరుగు వారికి చెప్పి వెళ్లాలి
- విలువైన వస్తువులుంటే లాకర్‌లో పెట్టుకోవడం ఉత్తమం

రాయదుర్గం: సంక్రాంతి పండుగ సెలవులు వచ్చాయి.. ఇంటిల్లిపాది సొంతూళ్లకు , బంధువుల ఇళ్లకు, విహార యాత్రలకు వెళ్లడం సహజం. అయితే జాగ్రత్తలు పాటించాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్ చేసుకొని దొంగలు చొరబడే అవకాశం ఉంది. ఇంట్లో నగలు, విలువైన వస్తువులు దోచుకెళ్లడం తరచూ చూస్తుంటాం. అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని పోలీసులు అప్రమత్తం చేస్తున్నారు. ఎక్కడైనా వెళ్లేవారు ఇరుగు పొరుగు వారికి చెప్పి వేళ్లాలని, విలువైన వస్తువులు లాకర్ పెట్టుకోవడం ఉత్తమమని పోలీసులు చెప్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉవరకొండ నియోజకవర్గాలు కర్ణాటక సరిహద్దున ఉన్నాయి. వీటికి దగ్గర్లో గుంతకల్లు, బళ్లారి లాంటి అంతర్జాతీయ రైలు సర్వీసులు నడుస్తున్నాయి. దొంగల చొరబాటుకు ఇదో మార్గం కావచ్చు. గత సెలవుల్లోనూ పలుచోట్ల దొంగ తనాలు జరిగాయి. చిరు వ్యాపారులుగా వచ్చి దొంగలు పట్టణాల్లోకి చొరబడతారని, అనువైన ప్రాంతాలను గుర్తించి వెళ్తారని పోలీసులు చెప్తున్నారు. శివారు ప్రాంతాలు, నిర్మానుష్య ప్రాంతాలు, రైల్వే లైన్ల సమీపంలోని గృహాలను లక్ష్యంగా చేసుకుంటారంటున్నారు. ఉదయం రెక్కీ నిర్వహించి, రాత్రికి దోపిడీ చేయడానికి ప్రణాళికలు వేస్తారని, ఇళ్లకు తాళాలు వేయాల్సి వస్తే పోలీసులతో పాటు ఇరుగు, పొరుగు చెప్పి వెళ్లాలని, విలువైన వస్తువులు, నగదు ఇంట్లో ఉంటే బ్యాంకు లాకర్‌లలో పెట్టుకుంటే మంచిదని పోలీసులుంటున్నారు. రాత్రి గస్తీ తిరిగే పోలీసులు ఈ పది రోజుల పాటు మరింత నిఘా పెంచేలా చర్యలు తీసుకున్నారు. దొంగ తనాలు జరిగే ప్రాంతాల్లో పోలీసులు సంచారం పెంచుతున్నారు.

జాగ్రత్తలు అవసరం



సంక్రాంతి సెలవులకు ఊర్లో వారు జాగ్రత్తలు పాటించాలి. ఇంట్లో విలువైన వస్తువులు పెట్టకుండా బ్యాంకుల్లో భద్ర పరుచడం ఉత్తమం. తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగలు చొరబడతారు. చుట్టు పక్కల వారితో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చి వెళ్లాలి. కొత్త వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాం. ప్రజలు పోలీసులకు సహకరించాలి. పక్కింట్లో అలికిడి జరిగినా పోలీసులకు గానీ డయల్ 100కు సమాచారం ఇవ్వాలి.

– జయానాయక్, అర్బన్ సీఐ, రాయదుర్గం

ఊళ్లకు వెళ్లే వారు పాటించాల్సినవి ఇవీ...

- ఊరెళ్లాల్సి వస్తే ఇంటి అడ్రస్, ఫోన్ నంబర్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇవ్వాలి.
- పోలీస్ అధికారులు మీ ఇళ్లపై ప్రత్యేక నిఘా ఉంచుతారు.
- మీ ఇంటిని గమనించాలని ఇరుగు, పొరుగు వారికి చెప్పాలి.
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. డీవీఆర్‌ను ఎవరికి తెలియని ప్రాంతాల్లో ఉంచుకోవాలి.
- ఊరు వెళ్తే వెండి, బంగారం, విలువైన వస్తువులు, డబ్బు ఇంట్లో ఉంచొద్దు. వెంట తీసుకెళ్లి ఇబ్బంది పడేదాని కంటే బ్యాంకు లాకర్‌లో భద్ర పరుచుకోవడం ఉత్తమం.
- తాళం వేసిన తర్వాత తలుపు కనిపించకుండా పరదా వేయాలి. ఇంటిలోని ఓ గదిలో విద్యుత్ దీపం వెలిగించి ఉండాలి.
- విహార యాత్రలు, సొంతూరుకు వెళ్లే విషయం సోషల్ మీడియాలో పంచుకోవద్దు.
- చోరీలకు ముందు దొంగలు కచ్చితంగా రెక్కీ నిర్వహిస్తారు. పగటి పూట వివిధ కారణాలు చెప్పి కాలనీల్లో తిరుగుతుంటారు.
- కొత్త వ్యక్తులపై అనుమానం కలిగితే డయల్ 100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌ను సమాచారం ఇవాలి.

మల్లేశ్వరస్వామి సేవలో కరీంనగర్ జడ్జి



న్యాయమూర్తి ప్రతిమను సన్మానిస్తున్న ఆలయ అర్చకులు

కంబదూరు: మండల కేంద్రంలోని పురాతన కమల మల్లేశ్వరస్వామి ఆలయాన్ని కరీంనగర్ జిల్లా జడ్జి ప్రతిమ ఆదివారం సందర్శించారు. ఆమె ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చరిత్రను అర్చలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఆలయ అర్చకులు జడ్జికి ఘన స్వాగతం పలికారు. జడ్జిని ఆలయ సిబ్బంది, అర్చకులు దుశ్శలువా, పూలమాలలతో సత్కరించారు.

తాగునీటి సమస్య పరిష్కారం

కుందుర్పి: మండలంలోని ఎర్రగుంటలో 6 నెలలుగా నీటి ఎద్దడితో ప్రజలు కష్టాలు పడేవారు. శ్రీరామరెడ్డి పథకం తాగునీరు కూడా మూడు నెలలుగా బంద్ కావడంతో సర్పంచ్ వన్నూర్‌రెడ్డి గ్రామంలో ఆదివారం బోరు బావి తవ్వించారు. నీరు సమృద్ధిగా పడింది. సర్పంచు మాట్లాడుతూ మంచినీటి పథకం కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతున్నా ఫలితంలేకపోవడంతో తానే బోరు బావి తవ్విసట్లు తెలిపారు. గ్రామంలో నీటి సమస్య తీరినట్లయ్యిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కంబదూరులో కలిసిన 2010-11 బ్యాచ్ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

బెళుగుప్ప/కంబదూరు: బెళుగుప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998–99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. అనంతరం అప్పటి గురువులు చిదానందప్ప, వెంకటరామయ్య, రామకోటేశ్వరరావు, గోవిందప్ప, రామిరెడ్డిని సత్కరించి, వారి ఆశీస్సులు పొందారు. అనంతరం బెళుగుప్ప ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి రూ.20 వేలు, ఉన్నత పాఠశాల అభివృద్ధికి రూ.30 వేలను అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు హనమంతనాయక్, హరిప్రసాద్, వెంకట్‌రెడ్డి, హేమనాథ్, సురేష్, సత్యనారాయణ, జయచంద్ర, అనంతలక్ష్మి, చంద్రకళ, సుమలత, శివగంగ, రామ్మోహన్, ఫిరోజ్, పాండు, శివ తదితరులు పాల్గొన్నారు.

- కంబదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2010–11 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. 14 ఏళ్ల తర్వాత అదే పాఠశాలలో అందరూ కలిసి ఆనందంగా గడిపారు. నాటి గురువులు కృష్ణానాయక్, హరికృష్ణ, చైతన్య, మురళిని సన్మానించి, వారి ఆశీర్వాదం తీసుకున్నారు.



బెళుగుప్ప జెడ్పీ ఉన్నత పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తాం

కూడేరు: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆ పార్టీ వలంటీర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు చోళసముద్రం ఎం.ధనుంజయ్య పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పర్యటించి వలంటీర్లుగా పని చేసిన వారందరినీ కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తనకు అవకాశమిచ్చిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంటకరామిడ్డికి, ఉరవకొండ నియోజక వర్గ సమన్వయకర్త , మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ధనుంజయ్య

గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తాం

కణేకల్లు: మండలం నుంచి వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో ముగ్గురికి చోటు కల్పించింది. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులుగా పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు మారెంపల్లి మారెన్న, జిల్లా కోశాధికారిగా జెడ్పీ మాజీ సభ్యులు పాటిల్ నాగిరెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శిగా యర్రగుంట మాజీ సర్పంచు పాటిల్ చెన్నకేశవరెడ్డిని పార్టీ అధిష్టానం లభించింది. తమపై విశ్వాసం ఉంచి పార్టీ బాధ్యతలు అప్పగించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, నేతలు కృతజ్ఞతలు తెలియజేశారు.



మారెంపల్లి మారెన్న, జిల్లా ఉపాధ్యక్షుడు



పాటిల్ నాగిరెడ్డి, జిల్లా కోశాధికారి



చెన్నకేశవరెడ్డి, జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి

బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తాం..

బొమ్మనహాళ్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామని ఆ పార్టీ జిల్లా సెక్రెటరీ యాక్టివిస్ట్ డాక్టర్ బసప్ప తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా సెక్రెటరీ యాక్టివిస్ట్‌గా ఉంతకల్లుకు చెందిన డాక్టర్ బసప్పను నియమించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానన్నారు. తనకు అవకాశ మిచ్చిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.



డాక్టర్ బసప్ప, జిల్లా సెక్రటరీ యాక్టివిస్ట్

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధికి సన్మానం



జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులును సన్మానిస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులును ఆ పార్టీ నాయకులు ఆదివారం సన్మానించారు. గోపారం శ్రీనివాసులు మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా స్థాయి పదవి ఇచ్చిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డికి, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్యకు, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, కౌన్సిలర్లు లక్ష్మన్న, పరమేశ్వరప్ప, నాయకులు బిక్కి హరి, షేక్షా, నాగరాజు, రామాంజనేయులు, వెంకటేశులు, బోయ తిప్పేస్వామి, ఆనంద్ జానీ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న జిల్లా కార్యాచరణ కార్యదర్శి మల్లెల జగదీష్

వజ్రకరూరు: నాయకులు, కార్యకర్తలందరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని జిల్లా కార్యాచరణ కార్యదర్శి, ఛాబాల సర్పంచు మల్లెల జగదీష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

కళ్యాణదుర్గం రూరల్: విట్లంపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త అంజినప్ప (40) అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం అంజినప్ప మృతదేహం వద్ద వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర నాయకులు బోయ తిప్పేస్వామి తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ ఆంజనేయులు, గొల్ల సూరి, బోరంపల్లి రామిరెడ్డి, ఎంపీటీసీ హనుమంతరెడ్డి, నాయకులు మల్లి, మోహన్, ప్రకాష్, దొణస్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికను బాగు చేయండి

కంబదూరు: అధ్వానంగా ఉన్న హిందూశ్మశాన వాటికను ఉపాధి హామీ కింద బాగు చేయాలని హిందూ దైవ సేవకుల కమిటీ సభ్యులు కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని హిందూ శ్మశాన వాటికను పరిశీలించారు. శ్మశాన వాటిలో కంప చెట్లు పెరిగి అపరిశుభ్రంగా ఉండటం, అక్కడ ఉన్న భవనానికి కనీస నీటి సౌకర్యం లేకపోవడాన్ని గమనించారు. అధికారులు స్పందించి ఉపాధి హామీ కింద శ్మశాన వాటికను శుభ్రం చేయించి, నీటి సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీధర్, నారాయణస్వామి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అనాథ వృద్ధులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

ఉరవకొండ: ఉరవకొండ ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990–91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని విఠల్‌రుక్మిణీ వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు బీఆర్ హరి, వడ్డే రమేష్‌బాబు, నూర్‌మహ్మద్, బాషా, గోపి, లక్ష్మన్న మాట్లాడారు. యువతకు స్వామి వివేకానంద ఆదర్శప్రాయులు అని తెలిపారు. అనంతరం అనాథ వృద్ధులకు అన్నదానం నిర్వహించారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి



జాతీయ యువజనోత్సవంలో మాట్లాడుతున్న స్వామి అర్చనానంద

రాయదుర్గంటౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ రాయదుర్గం సిటిజన్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏపీ ఎన్‌జీఓ భవనంలో జాతీయ యువజనోత్సవం, స్వామి వివేకానంద జయంతి, ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ ఫౌండర్ మెల్విన్ జోన్స్ జయంతిని ఆదివారం జరుపుకున్నారు. శారదా ట్రస్ట్ స్వామి అర్చనానంద మాట్లాడారు. ఆత్మ విశ్వాసం, లక్ష్య సాధన ఉంటేనే ఎలాంటి రంగాల్లోనైనా రాణించొచ్చన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వాడేకర్ అంభోజీరావు మాట్లాడారు. మెల్విన్ జోన్స్‌ను ఆదర్శంగా తీసుకొని యువత సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి అశోక్, కోశాధికారి సత్యనారాయణ, సీనియర్ సభ్యులు శంకర్, పొరాళ్ల ధనార్జున, శ్రీనివాసులు, ఉమామహేశ్వరయ్య, ఎంఈఓ వెంకటరమేష్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' సద్వినియోగం చేసుకోండి

కూడేరు: జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఏపీఓ తులసీ ప్రసాద్ ఆదివారం తెలిపారు. నిబంధనల మేరకు పనులను నాణ్యతగా చేస్తే రూ.300 వరకు కూలీ వర్తిస్తుందని ఆయన తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి

బొమ్మనహాళ్: యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ మైదానంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ కబడ్డీ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే కాలవ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పయ్యావుల అనిల్, శ్రీకాంత్, నవీన్, కన్వీనర్ బలరామిరెడ్డి, నాయకులు కేశవ్‌రెడ్డి, కొత్తపల్లి మల్లికార్జున, వెంకటేశులు పాల్గొన్నారు.

గోకులంషెడ్లు, రోడ్లు ప్రారంభం

కణేకల్లు: బెణికల్లు గ్రామంలో నూతనంగా నిర్మించిన రెండు గోకులం షెడ్లతోపాటు సిమెంటు రోడ్లను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గోకులాల షెడ్లు రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ నరసింహాచారి, మాజీ సర్పంచు యు.ఆనంద్‌రాజు, మాజీ ఎంపీపీ మాబుసాబ్, కణేకల్లు చెరువు సంఘం అధ్యక్షుడు బీటీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలవ

బొమ్మనహాళ్: ఐదేళ్లలో గ్రామాలన్నింటిలోనూ సిమెంట్ రోడ్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం లింగదహాళ్, కొలగానహాళ్లి గ్రామాల్లో గోకుల షెడ్లు, సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె పండుగ గ్రామసభలో ఎమ్మెల్యే కాలవ మాట్లాడారు. నియోజకవర్గంలో రూ.16.46 కోట్లతో 421 సీసీ రోడ్లు పనులు ప్రారంభించి ఇప్పటికి రూ.13.15 కోట్లు విలువైన 337 పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. 328 గోకులాలు మంజూరు కాగా, 219 ప్రారంభమై 113 పూర్తి చేసినట్లు తెలిపారు.

పశు గ్రాసం ట్రాక్టర్లతో ట్రాఫిక్ చిక్కులు



ఎస్‌బీఐ ముందు ట్రాఫిక్‌లో ఇరుకున్న పశుగ్రాసం ట్రాక్టర్లు

రాయదుర్గం: నియోజకవర్గంలోని కణేకల్లు, బొమ్మనహాళ్ హెచ్‌ఎల్‌సీ మాగాణి నుంచి రాయదుర్గం మీదుగా కర్ణాటక రాష్ట్రం మొలకాల్మూరు వైపు ట్రాక్టర్లలో నిత్యం పశు గ్రాసం తరలిపోతోంది. దీంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. దారి నిండా గ్రాసం వెళ్తుండడంతో ఆటోలు ఎదురొచ్చినా ట్రాఫిక్ చిక్కులు తప్పడంలేదు. తార్పాలిన్ కప్పకపోవడంతో వరి గడ్డి చూరలు గాల్లో కలిసి వాహనదారుల కళ్లలోకి పడుతోంది. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఊరి చివర్లో బైపాస్ మీదుగా మళ్లించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.